భూగర్భ సాహసయాత్ర!

'రాజా'

"యస్ మిస్టర్ ప్రొఫెసర్! నా ద్వారా మీకు కావల సిన సహాయమేమిటో నిస్సంకోచంగా చెప్పండి" అంటూ రివాల్వింగ్ ఛెయిర్‌లో వెనక్కి వాలాడు. యస్. బి. డైరెక్టర్ రమేష్ మిశ్రా.

చిన్నగా దగ్గారు ప్రొఫెసర్ ఆంథోనీగారు. మిశ్రా బొటనవేలు రికార్డర్ బటన్ నొక్కింది.

"మిస్టర్ రమేష్ మిశ్రా! నేను భూగర్భ పరిశోధనా కేంద్రంలో ప్రొఫెసర్ గా ఉంటున్న సంగతి మీకు తెల్సు. మా పరిశోధనా కేంద్రం ముఖ్యోద్దేశం, భూగర్భంలోవున్న ఖనిజనిక్షేపాలు, వింతలు విశేషాలు తెల్సుకోవడం.

మా పరిశోధనల ఫలితంగా కొన్ని వందల సంవత్స

రాల క్రితం భూగర్భంలో కల్సిపోయిన కొన్ని పట్టణాలు ప్రాచీన నాగరికతా బయటపడ్డాయి.

ఇలా చెప్పుకుపోతే చాలా వస్తుంది. ఇక అసలు విషయానికి వద్దాం.మనమున్న భూమికి ఎక్కడో ఒకచోట కేంద్రం ఉంటుందని మీకు తెల్సు. దానినే భూగర్భ కేంద్రం అంటారనికూడా తెల్సు.

ఈ భూగర్భ కేంద్రం చేరుకోవాలని చాలా దేశాలు ప్రయత్నించాయి. కాని వారి ప్రయత్నాలు ఫలించలేదు. కొందరు కొన్ని మార్గాలద్వారా భూగర్భంలోకి ప్రవేసించగలిగారు గాని తిరిగి రాలేదు. చివరకు పెసుగెత్తి ప్రపంచ దేశాలన్నీ ఈ ప్రయత్నాన్ని వదిలేశాయి. అక్కడక్కడ కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నప్పటికీ సఫలీకృతులుకాలేకపోయాయి,'' అగారు ప్రొఫెసర్ గారు.

కోటుజేబులోంచి పైప్ తీసి వెల్గించుకొని గట్టిగా దమ్ములాగి తిరిగి చెప్పసాగాడు.

''ఈ మధ్య మావాళ్ళు ఒరిస్సాలోని ఒక జిల్లాలో భూగర్భంలో ఉన్న నిధులకోసం జరిపిన త్రవ్వకాలలో ఒక పెట్టె దొరికింది. దానిలో దొరికిన కొన్ని కరపత్రాల ద్వారా చాలా ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడ్డాయి. ఆ కరపత్రాలలో ఉన్న విషయాలు క్లుప్తంగా చెప్పాలంటే, సుమారు ఎనిమిదివందల సంవత్సరాలక్రితం ఒక బ్రిటిష్ పరిశోధకుడు ఐస్‌లాండ్‌లో ఉన్న స్నోఫెల్ అగ్నిపర్వతంద్వారా భూగర్భకేంద్రాన్ని చేరుకోడానికి వెళ్ళి జయప్రదంగా తిరిగొచ్చాడు.

కాని అతను భూగర్భకేంద్రం సమీపానికి వెళ్ళికూడా కొన్ని అనివార్య కారణాల వలన తిరిగి వచ్చేయవల్సి వచ్చింది. ఆ పరిశోధకుడిపేరు ఫిలిప్స్ జె. అడ్వర్ట్. బ్రిటీష్ విల్స్‌లోని విర్లండ్ నివాసి.

కొన్ని సంవత్సరాలు కష్టపడి తెల్సుకొన్న విషయాల ద్వారా అతడు ఐస్‌లాండ్‌లోని స్నో ఫెల్ అగ్నిపర్వతం లోపలికి ఉన్న బిలంద్వారా ప్రయాణమయ్యాడు. అప్పటికే ఆ అగ్నిపర్వతం ప్రేలి రెండు వేల సంవత్సరాలయింది.

అది ప్రేలినప్పుడు లావా మూడు దారులుగా బయటకు వచ్చింది. కొన్ని సంవత్సరాలకు ఆ అగ్నిపర్వతం చల్లారి పోయి లావా బయటకు వచ్చిన దారులు మూడూ, బిలాలుగా ఆరిపోయాయి. అందులో మధ్య బిలంద్వారా ప్రయాణమయ్యా డతను.

కాని అతను తిరిగొచ్చాక దురదృష్టవశాత్తు అతని మాటల నెవరూ నమ్మలేదు, సరికదా విమర్శించి తిట్టారు. ఏమి చెయ్యాలో తోచని ఆ పరిశోధకుడు తాను తెల్సుకొన్న విషయాలను క్లుప్తంగా కరపత్రాలపై కెక్కించి వాటిని కొన్ని పెట్టెలలో పెట్టి ప్రపంచయాత్ర సాగిస్తూ, ప్రతీ దేశంలో ఒకోటి చొప్పున వదిలాడు. అప్పటి కింకా ప్రపంచం నాగరికత పొందలేకపోయినా భవిష్యత్తులో నైనా తన పరిశోధన వలన ప్రపంచానికి మంచి చేకూరుతుందనే నమ్మకాన్ని వెలిబుచ్చుతూ ఆ పని చేశానని తెలియపర్చాడా భూగర్భ పరిశోధకుడు" ఆగి పైపు నోట్లో పెట్టుకొన్నారు ప్రొఫెసర్ గారు. పొగ వెచ్చగా గుండెలను తాకింది.

ఆశ్చర్యంగా వింటున్న రమేష్ మిశ్రా, ప్రొఫెసర్ గారి వైపు సందేహంగా చూశాడు. చిన్నగా నవ్వాడు ఆయన. నోట్లోని పైపు చేతిలోకి మారింది.

"మిస్టర్ మిశ్రా ఈ విషయం తెల్సిన అనంతరం జరిగిన తర్జన భర్జనలలో భూగర్భ కేంద్రానికి బయలుదేరే బాధ్యత నాపై పడింది. నేనూ సంతోషంగా ఒప్పుకొన్నాను.

సో, ఈ భూగర్భ కేంద్ర ప్రయాణంలో ఎన్నో ప్రమా

దాలు ఎదురవ్వవచ్చు. అనుక్షణం ప్రమాదాలతో నిండిన ఈ సాహసయాత్రలో నాకు సహాయంగా ఒక వ్యక్తి కావాలి. సమర్థుడూ, సాహసవంతుడూ ఎలాంటి ప్రమాదాన్నైనా సమయస్ఫూర్తితో ఎదుర్కొనగల ధైర్యవంతుడూ ఇత్యాది లక్షణాలుగల వ్యక్తులు ఒక్క స్పెషల్ బ్రాంచ్ వాళ్ళేనని నాకు తెలుసు. అందుకే మీ సహాయంకోసం వచ్చాను" పూర్తిచేసి తిరిగి పైప్ నోట్లో పెట్టుకొన్నారు ప్రొఫెసర్ గారు.

ఐదు నిముషాలు తీవ్రంగా ఆలోచించిన రమేష్ మిశ్రా పక్కనేవున్న బెల్ నొక్కారు.

* * *

'బాస్' నుంచి కబురు రాగానే చూస్తూన్న ఫైల్ టేబిల్ పై పడేసి బయటకు కదిలాను. నా మనసంతా ఆనందంగావుంది. బాస్ పిలుపు అనగానే ఏదో మంచి కేసే తగిలిందన్నమాట అనుకొన్నాను. బాస్ రూంముందు నిల్చి మునివేళ్ళతో స్ప్రింగ్ డోర్ పై చిన్నగా శబ్దం చేయగానే 'కమిన్' అన్న బాస్ కంఠం ఇంపుగా నన్ను తాకింది.

తలుపు తోసుకొని లోనికి నడిచి బాస్ ఎదురుగా నిల్చాను.

"టేక్ యువర్ సీట్ మిస్టర్ విజయ్."

"థాంక్యూ బాస్" అంటూ కూర్చున్నాను.

"ఈయన ప్రొఫెసర్ ఆంథోనీ. భూగర్భ పరిశోధనా కేంద్రంలో ప్రొఫెసర్" అంటూ నన్ను ఆయనకు పరిచయం చేసారు బాస్.

"గ్లాడ్ టూ మీట్ యూ" అన్నారు ప్రొఫెసర్ గారు చేయందిస్తూ.

"సేమ్ టూ యూ."

బాస్ నావైపు తిరిగారు.

"విజయ్, ఈయన ప్రభుత్వ కోరిక మీద భూగర్భ కేంద్రానికి ప్రయాణమౌతున్నారు. ఆయన కోరికపై నిన్నూ ఆయన వెంట పంపించడానికి నిశ్చయించుకొన్నాను. రేపే మీ ప్రయాణం. అన్నీ సిద్ధంగా ఉంచుకో" అంటూ చిన్నసైజు టేప్ రికార్డర్ నా కందించారు బాస్.

"థాంక్యూ బాస్. కాని వివరాలు?"

"ఈ టేప్ రికార్డర్ లో ఉన్నాయి. నీ రూమ్‌కు పోయి తీరిగ్గా విను."

"ఓ. కె. సర్."

"విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్."

ప్రొఫెసర్ గారితో కరచాలనం చేసి బయటకు నడిచాను. మరో అయిదు నిముషాల్లో నా రూంలో తీరిగ్గా కూర్చొని టేప్ రికార్డర్ ఆన్ జేసి అందులోంచి వినబడుతున్న ప్రతి మాటనూ శ్రద్ధగా వినసాగాను.

2

ఎదురుగా స్నోఫెల్ అగ్నిపర్వతం గంభీరంగా నిలబడి ఉంది. సుమారు పద్దెనిమిది వందల అడుగుల ఎత్తుంటుంది.

"ఓ. కె. ఇక బయలుదేరండి" అన్నారు ప్రొఫెసరు గారు ఎదురుగా ఉన్న నలుగురు ఐస్ లాండర్స్‌తో. క్రింద పడిఉన్న మూటలను ఎత్తుకొని చకచకా ముందుకు కదిలారు నలుగురూ. పర్వతాలలో నడవటంలో బాగా అలవాటున్న ఆ నలుగురూ అంత బరువైన మూటలను ఎత్తుకొని కూడా వేగంగా నడవసాగారు. నెమ్మదిగా అడుగులేస్తూ చుట్టూ పరిశీలించి చూశాను. దూరంగా ఫౌంటెన్‌లా పర్వతం అడుగుభాగం నుంచి పైకి చిమ్ముతున్న

నీటి ఊట నన్నాకర్షించింది.

"ఏమిటదిక?" వ్రేలుతో చూపిస్తూ ఇంగ్లీషులో అడిగాను మాతో వస్తున్న గైడ్‌ని. నల్లగా బలంగా పొడుగ్గా ఉన్నాడతను. మాతో కల్సి భూగర్భంలోకి రావటానికి వారానికి 50 డాలర్లకు కుదుర్చుకొన్నారతనిని ప్రొఫెసర్ గారు.

"వేడినీరు! అగ్నిపర్వతం అంతర్భాగంలో ఉన్న చల్లని నీరు బైటకొచ్చేటప్పుడు పర్వతంలోని వేడికి మరిగి షాంపెన్‌లా పైకి చిమ్ముతుంది" అన్నాడు కావా. అది అతని పేరు.

"మరో విశేషం కూడా ఉంది దానిలో" అన్నారు ప్రొఫెసర్ గారు.

"ఈ నీరు ఇలా షాంపెన్‌లా పైకి చిమ్ముతున్నంత సేపూ ఈ అగ్నిపర్వతం ప్రేలదన్న మాట. ఎప్పుడైనా అగ్నిపర్వతం ప్రేలేటట్లయితే ఒక గంటముందే బైటకొచ్చు చున్న నీరు ఆగిపోయి పొగలు బైటకొస్తాయి. అది చూడ గానే ఈ చుట్టుపట్ల నివసించే ప్రజలు ఈ ప్రదేశాన్ని వదిలి సాధ్యమైనంత దూరంగా వెళ్ళిపోతారు" చెప్పారు ప్రొఫెసర్.

సాయంత్రం ఏడింటికి స్నోఫెల్ పర్వతశిఖరాన్ని చేరుకొన్నాము మేము.

సామానులు మోసుకొచ్చిన కూలీలకు డబ్బిచ్చి పంపేసారు ప్రొఫెసర్ గారు.

దూరంగా కన్పిస్తున్న మూడు బిలాలవైపూ పరిశీలనగా చూశాను. చీకటి పడేలోగా చుట్టుపట్ల పరిశీలించి ఆ రాత్రికి అక్కడే విశ్రాంతి తీసుకొన్నాము.

3

తెల్లవారగానే కాలకృత్యాలు తీర్చుకొని ఒక బిలం

అంచుకు వెళ్ళి లోనికి చూశాను. సూర్యకిరణాలు పడుతున్నంతమేరా రాతినేల మెరుస్తోంది. తరవాత అంతా కటిక చీకటి ఆక్రమించి ఉంది.

కొన్ని వేల ఏళ్ళ క్రితం యీ అగ్నిపర్వతం బ్రద్దలై ఈ బిలంలోనించి లావా బయటకు వచ్చిందన్న విషయం స్ఫురణకు రాగానే ఒళ్ళు జలదరించింది.

మరో అరగంటలో ముగ్గురం రెడీ అయ్యాము. క్రింద పడేసి ఉన్న మూటలు విప్పాడు కావా. దిక్సూచీ, థర్మామీటర్, క్రోనో మీటర్ (లోతులు కొల్చే యంత్రము), కెమెరా మొదలైనవి ప్రొఫెసర్ గారు తన బాగ్‌లో సర్దుకొన్నారు.

సుమారు ఆరునెలలకు సరిపోయే ఆహారం, పదిరోజులకు సరిపోయే నీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, కొన్ని డైనమేట్స్ మొదలైన సామానులు నా బాగ్‌లో సర్దాను.

మిగిలిన సామానులు కొన్ని రకాల పనిముట్లు సంచిలో చుట్టి కావా భుజానికి తగిలించుకొన్నాడు. మోయడానికి వీలుకానివి, క్రిందపడినా విరిగిపోనివి ముందుగానే బిలంలోకి విసిరేశాను.

ముగ్గురి దగ్గరా రివాల్వర్స్, తగినంత అమ్యూనిషన్ రడీగా ఉంది. ముగ్గురి చేతుల్లో పవర్ ఫుల్ టార్చ్‌లైట్స్ చీకటిని పారద్రోలటానికి రెడీగా ఉన్నాయి.

నా సంచిలోంచి పొడుగైన త్రాడుతీసి ఒక కొసను బలంగా ఉన్న రాయికి ముడిపెట్టి రెండో కొసను లోనికి జారవిడిచాను. లోనికి దిగాక చేదుకొంటే వచ్చేలాగ జారుముడి వేశాను. ముందుగా కావా త్రాడు సహాయంతో లోనికి జారాడు.

* * *

మధ్యాహ్నం ఒంటిగంటయింది అఖరున లోనికి దిగిన నేను నేలపై అడుగుపెట్టేసరికి. మేము దిగిన బలం సుమారు నూరడుగుల చుట్టుకొలత కలిగి ఉండటంతో చాలా విశాలంగా ఉంది. ముందుగా పారేసిన సామానులు తీసుకొని ముందుకు నడిచాం.

మా చేతుల్లో వెలుగుతున్న టార్చిలైట్స్ కాంతి పరిసరాలను పట్టపగలు చేస్తోంది. నిలువుగా గోడలా ఉన్న రాతిని పట్టుకొని చూశాను. పట్టు చిక్కలేదు. గ్రాఫైట్ రాయి కావడంవలన తళతళా మెరుస్తోంది.

ప్రొఫెసర్ గారు టార్చిలైట్ను నాలుగు వైపులా త్రిప్పి చూశారు.

ఎదురుగా కన్పిస్తున్న సొరంగం లోనికి నడిచాము. ముందు నడుస్తున్న నా చేతిలోని టార్చి దారిని ప్రకాశవంతం చేస్తోంటే రెండో చేతిలోని రివాల్వర్ ఆకలిగా చూస్తూంది.

హావా ఐస్లాండ్స్లో వేటకాడు కావడం వలన రైఫిల్ షూటింగ్లో ఎక్స్పర్ట్. ఇక నేను సరేసరి. పోతే ఎప్పుడో చిన్నప్పుడు సరదాగా నేర్చుకొన్న షూటింగ్ ప్రొఫెసర్ గారికి ఇప్పుడు బాగా అక్కరకొచ్చింది. ఆ సొరంగంలో మా ప్రయాణం కొనసాగించాము.

వారం రోజులు గడిచాయి.

4

భూగర్భంలో తొమ్మిది మైళ్ళ లోతున ఈశాన్యంగా బ్రిటన్ వైపు 60 మైళ్ళు వెళ్ళాము. అంటే ఐస్లాండ్ దాటి ఆర్కిటిక్ మహాసముద్రం క్రింద 9 మైళ్ళ లోతులో ప్రయాణం చేస్తున్నామన్నమాట.

ఆ విషయం నాకెందుకో మహాద్భుతంగా అన్పించింది.

అదే చెప్పాను ప్రొఫెసర్ గారితో. వెంటనే నవ్వి, "ఇంత కంటే విచిత్రమైన విషయాలను ముందు ముందు చూస్తావు నువ్వు!" అన్నారు.

ముందుకు నడుస్తున్నామన్నమాటేగాని నా ఊహలన్నీ సముద్రంమీదే ఉన్నాయి.

సముద్రంపైన ఎలా ఉందో? ఏదైనా తుఫాన్ వచ్చి సముద్రం అల్లకల్లోలమైపోతూ ఓడలన్నీ మునిగిపోతున్నా ఏమో?

అసలు సముద్రంలో తిరిగే పెద్ద పెద్ద చేపలు, తిమింగలాలు తమ తోకలతో సముద్ర గర్భంలో అడుగున నేలను బలంగా కొడుతూంటే మా తలపైన ఉన్న రాతి నేల కూలి పోదూ?

మరుక్షణంలోనే నా అర్థంలేని ఆలోచనకు నవ్వొచ్చింది "అయినా మా తలపై ఉన్న నేల అట్టముక్కలా కొద్ది మందమా? దాదాపు తొమ్మిదిమైళ్ళ ఎత్తుంది. ఓ వెయ్యి తిమింగలాలు కల్సి సముద్రం అడుగున కలిసికట్టుగా బాదినా ఏమీ ప్రమాదం లేదే?

ఆలోచనలతో తల మున్కలౌతున్న నన్ను ప్రొఫెసర్ గారి పిలుపు వాస్తవానికి లాక్కొచ్చింది.

"ఇంకా నీరెంతుంది విజయ్?" వాటర్ బాటిల్స్ చూసి ఉలిక్కిపడ్డాను. ఎందుకంటే వాటర్ ఇంకో రోజు కంటే ఎక్కువ రాదు. ఆ విషయమే చెప్పాను ప్రొఫెసర్ గారిక్కి.

ఆయన ఆలోచనలో పడ్డాడు. పైకి కన్పించకపోయినా ఆయనలోనూ కలవరపాటు కలడం నేను గమనించాను. అసలు ఆయన ఐడియా మొదట్లోనే తప్పిందేమో?

భూగర్భంలో దారిలో ఎక్కడో వకచోట మాకు నీటి ఊటలు తగలొచ్చని ఆయన ఎక్స్‌పెక్ట్ చేశారు. ఆ ధైర్యంతోనే పది రోజులకు సరిపడే నీరు తెచ్చుకొన్నాం. కాని ఇప్పటివరకూ ఎక్కడా నీటిఊటలు తగల్లేదు. ఇక ముందు తగులుతాయనే ఆశ సన్నగిల్లుతోంది. పోనీ వెనక్కి తిరిగి పోదామంటే మళ్ళీ ఎనభై మైళ్ళు పోవాలి. ఒక్కరోజులో ఎలా వెళ్ళగలం?

ఆలోచిస్తున్న ప్రొఫెసర్ గారు ఒక నిశ్చయానికొచ్చినట్లు తల పంకించి,

"సరే పదండి! ముందుకే వెళ్దాం. కాకపోతే వెనక్కి వెళ్ళడం అసంభవం. నీరులేక మాడి చస్తాం. ముందుకెళితే నా ఊహ ప్రకారం ఎక్కడన్నా నీటి ఊటలు తగలొచ్చు" అంటూ కదిలారు.

ఆ రోజు దాదాపు పదిహేను మైళ్ళు నడిచాం. ఆ సాయంత్రంతో మా వద్దనున్న నీరు కాస్తా అయిపోయింది. ఆ మర్నాటి మాటేమిటి. తిండి కావలసినంతుంది. కాని నీరు? నీరు దొరక్క ఈ భూగర్భంలో మలమలా మాడి చచ్చిపోతామేమో అన్న ఆలోచన రాగానే నా ఒళ్ళంతా అవ్యక్తమైన భయంతో జలదరించింది.

నాకా క్షణంలో ఉన్న ఫళంగా పైనున్న గ్రాఫైట్ రాతిని చీల్చుకొని ఎగిరి ఆర్కిటిక్ సముద్రంలో పడాలన్పించింది. ఆ రాత్రికి ఆలోచనలతో నిద్ర పట్టలేదు సరిగా.

ఆ మర్నాడు ఉదయమే నీటిధారల కోసం ఆశగా బయలుదేరిన మాకు సమయం గడిచేకొద్దీ నిరాశే ఎదురవసాగింది. సాయంత్రమయ్యేటప్పటికి నీర్సంతో వడిలిన తోటకూర కాడల్లా తయారయ్యాము. మరికొంత దూరం నడిచి ఓచోట కూలబడిపోయాం.

నీరసంతో కాళ్ళు లాగుతోంటే, దాహంతో నోరెండి పోయి కళ్ళు బయటకు వస్తున్నాయి. ఫుడ్ పేకట్స్ తెరిచి బిస్కట్లు తీసాడు కావా. ఎండిపోయిన పెదాలను నాలుకతో తడుపుకొంటూ మెల్లిగా నములసాగాను.

కాని ఎక్కువగా తినలేక పోయాను. మరి కాస్సేపట్లో అలసటతో నా కళ్ళు మూతలు పడ్డాయి.

5

ఏదో శబ్దమైతే మెలకువ వచ్చి కళ్ళు తెరిచాను. నన్ను దాటి ముందుకు వెళ్తున్న ఆకారాన్ని చూసి ఉలిక్కిపడి మరుక్షణమే టార్చ్‌లైట్ వెలుగులో ఆ ఆకారం కావాది అని తెల్సుకొన్నాను. టార్చ్‌లైట్ పట్టుకొని భుజాలపై దుప్పటి కప్పుకొంటూ వడివడిగా నడిచి పోతున్నాడు కావా.

అయినా ఈ అర్ధరాత్రి మమ్మల్నెవరినీ లేపకుండా ఎక్కడికి పోతున్నాడు. ఒకవేళ పారిపోతున్నాడా? అయినా పారిపోయేవాడు వెనక్కి వెళ్ళకుండా ముందు కెందు కెళ్తాడు.

ఇక ఆలోచించే ఓపిక లేక మళ్ళీ కళ్ళు మూసుకొన్నాను.

కాని ఓ అరగంట గడవకముందే తిరిగి పరుగెత్తుకొచ్చాడు కావా. ప్రొఫెసర్ గారిని కుదుపుతూ అరిచాడు "మాస్టర్ ... మాస్టర్" అంటూ.

"వాట్? ఏం జరిగింది?" లేచి కూర్చొంటూ అడిగారు ప్రొఫెసర్ గారు.

"వాటర్ మాస్టర్ వాటర్" అరిచాడు. కళ్ళు మూసుకొని వింటున్న నాకు వెయ్యి ఏనుగుల శక్తి వచ్చినట్లైంది.

"వాటరా? ఎక్కడ?" అడిగాను.

"దగ్గరలోనే. కమాన్ హారియప్" అంటూ నా భుజం పట్టుకొని పైకి లేపాడు.

కొద్ది క్షణాలలో ముగ్గురం ముందుకు కదిలాము. అర మైలు దాటకముందే హోరుమంటూ పెద్దగా నీటిశబ్దం వినిపించింది. రెట్టించిన ఉత్సాహంతో ఇంకా వేగంగా నడిచాము.

కొంచెం దూరం వెళ్ళేసరికి ప్రక్కనే జలప్రవాహం ఉన్నంత గట్టిగా శబ్దం వినిపించసాగింది. ఆగాడు కావా.

"ఇంకా ముందుకెళ్దాం" అన్నారు ప్రొఫెసర్.

"అక్కరలేదు. ముందు కెళ్ళినంతమాత్రాన నీటిధార కనిపించదు సరికదా దూరమైపోయి శబ్దం కూడా వినిపించదు" అంటూ సంచిలోంచి ఒక పొడుగాటి ఇనప ఊచ తీశాడు. దాని చివర సూదిలా కూచిగా ఉంది.

ముందుకు నడిచి రాతిగోడను పరీక్ష చూశాడు. దానికి చెవి ఆన్చి కాస్సేపు విని మావైపు తిరిగి, "ఎంతో దూరం లేదు. బహుశా రెండడుగులు ఉండొచ్చు" అంటూ ఆ ఊచతో రాతిని బలంగా కొట్టాడు. ఠంగుమంది రాయి.

ఓ, అరగంట గడిచీ గడవకముందే హోరు పెద్దదయింది. దాదాపు అప్పటికి అడుగున్నర లోతు త్రవ్వాడు.

నా నోట్లో తడారిపోతోంది. కళ్ళలో ప్రాణాలు నిల్పుకొని చూస్తున్నాను. చివరి సారిగా రాతిగోడని చేయెత్తి ఇనప ఊచతో బలంగా కొట్టాడు.

మరుక్షణమే విసురుగా కావా ముఖాన్ని తాకింది మరుగుతున్న వేడినీరు. భయంకరంగా అర్చాడతను. చటుక్కున అతని భుజం పట్టుకొని ప్రక్కకు లాగేశాను.

ఖాళీగాఉన్న వాటర్ బాటిల్ వకటి తీసి దానినిండా

నీరు పట్టారు ప్రొఫెసర్ గారు. ఆ నీరు చల్లారేటప్పటికి కావాకు మందు వెయ్యడం అయిపోయింది.

చల్లారిన నీటిని ఆత్రంగా త్రాగాము ముగ్గురమూ. అద్భుతంగా ఉన్నా క్రొద్దిగా ఐరన్ స్మెల్ కొట్టాయి నీరు.

"ఐరన్, కాల్షియం ఎక్కువగా ఉన్నాయి ఇందులో. చాలా ఆరోగ్యం" అన్నారు ప్రొఫెసర్ గారు నీరు త్రాగుతూ.

రాతి గోడలోంచి బయటకు ఉరుకుతున్న వేడినీరు నెమ్మదిగా పిల్లకాలవలాగ ముందుకు సాగుతోంది.

"వెల్! మనకు దారిలో నీరయిపోయినప్పుడల్లా ఇందులో నీరు పట్టుకోవచ్చు. మరో విషయం ఈ నీటి ఊటను కను క్కొన్నది కావా గాబట్టి అతని పేరున దీనికి కావా కెనాల్ అని పేరెడుతున్నాను" అంటూ బాగ్ లోంచి మిగిలివున్న ఒక జిన్ బాటిల్ పైకితీశారు ప్రొఫెసర్ గారు.

ఆ రాత్రికి అక్కడ్నుంచి కదల్లేదు మేము.

6

"నేటికి మనం బయలుదేరి సరిగా రెండు నెలల పదిహేను రోజులు" అన్నాను నేను ఖాళీ అయిన వాటర్ బాటిల్స్ ప్రక్కనే పారుతున్న కావా కెనాల్ లో ముంచుతూ.

"ఇప్పు డెక్కడున్నట్లు మనం?" అడిగాడు కావా నోట్లోని బ్రెడ్ నములుతూ.

క్రోనోమీటర్, దిక్సూచీలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ ఆంథోనీగారు తలపైకెత్తారు. ఖంగుమంది ఆయన కంఠం.

"ఐస్‌లాండ్ కు ఈశాన్యంగా ఆర్కిటిక్ మహాసముద్రం దాటి 200 మైళ్ళలోతులో బ్రిటిష్ ఐల్స్ దాటుతున్నాం."

"ఇప్పటికి ఎంతదూరం వచ్చామంటారు?" అడిగాను.

"సుమారు పదమూడువందల మైళ్ళు వచ్చుండొచ్చు" ముందుకు కదులుతూ అన్నాను. వారిగువురకూ కొద్దిదూరంలో నడుస్తున్నాను. ప్రక్కనే ప్రవహిస్తున్న కావాకెనాల్ వింతవింత శబ్దాలు కలిస్తూ మనస్సునెంతో ఆహ్లాద పరుస్తోంది. కళ్ళముందు బాస్ మెదిలారు. ఆయనకు మనసులోనే కృతజ్ఞతలు తెల్పుకొన్నాను నాకిలాంటి అడ్వెంచర్ కల్పించినందుకు. ఎప్పుడు మారు వేషాలలో దేశాలు తిరుగుతూ ఒకరినొకరు కాల్చుకుంటూ, దేశంకోసం ప్రాణాలు సైతం త్యాగంచేసే గూఢచారులంటే నాకు చాలా ఇష్టం. అందుకే ఇంట్లో వప్పుకోకపోయినా పట్టుపట్టి మరీ 'యస్ బి' లో చేరాను.

చేరిన కొన్నాళ్ళకే మంచి పేరు తెచ్చుకొని సమర్థవంతుడిగా బాస్ దృష్టిలో గుర్తింపబడ్డాను. అసలు నాకీ అవకాశం రాకపోతే ఇప్పుడేం చేస్తుండేవాడినో? బహుశా ఏ పాకిస్తానేనా వెళ్ళేవాడినేమో!

ఆలోచనలనుంచి తేరుకొంటూ "ప్రొఫెసర్ సాబ్" అంటూ పిలిచాను. కాని సమాధానం లేకపోవడంతో ఉలిక్కిపడి చుట్టూ పరిశీలించి చూశాను.

ఎక్కడా ప్రొఫెసర్, కావాల జాడలేదు. ఒకవేళ నేను ఆలోచనలోపడి దారితప్పానేమో అన్న ఆలోచన రాగానే కంగారుగా క్రిందకు చూశాను.

గలగలా ప్రక్కనే క్రిందుగా ప్రవహిస్తుండే కావా కెనాల్ కన్పించలేదు. జరిగింది అర్థమయ్యేసరికి నావంటి నిండా చెమటలు పట్టాయి. వెనక్కి పరిగెత్తాను. టార్చ్ లైట్ వెలుగులో గ్రానైట్ గోడలు మెరుస్తున్నాయి.

నాలుగైదు గంటలసేపు పిచ్చిగా వెదికాను. వాళ్ళ జాడ లేదు సరికదా కావా కెనాలైనా కన్పించలేదు. నా

మతి పోతోంది.ఏం చెయ్యాలో తోచటంలేదు.తలపైనున్నది 150 మైళ్ళ ఎత్తు రాయి. నేనెక్కడున్నానో నాకే తెలీదు. తిరిగి ప్రొఫెసర్ గార్ని చూస్తానో లేదో? నా కా క్షణంలో భూగర్భంలో ఆకలిదప్పులతో అలమటిస్తూ దిక్కు లేని చావు చస్తానేమో అన్పించింది.

తిరిగి వెతుకుతూ బయలుదేరాను.

7

రెండురోజులు గడిచాయి.

ప్రొఫెసర్ గారి జాడ దొరకలేదు. నా దగ్గిరున్న వాటర్ బాటిల్ లో మిగిలివున్న కొద్దినీరు త్రాగాను. బాటిల్ దూరంగా విసిరేశాను.

ఆహారం కావలసినంతున్నా నీరు లేకుండా ఎలా బ్రత కాలో అర్థంకావటంలేదు. గమ్యంలేకుండా ముందుకు నడు స్తున్నాను. నా కాళ్ళక్రింద కంకర్రాళ్ళు కరకరలాడు తున్నాయి.

"విజయ్" అస్పష్టంగా కేక వినగానే ఉలిక్కిపడి ఆగిపోయాను. భ్రమో, నిజమో అర్థంకాలేదు. చెవులు రిక్కించి గోడకు ఆనించి నిలబడ్డాను. అయిదు నిముషా లనంతరం మళ్ళీ విన్పించింది అదే కేక. ఈసారి స్పష్టంగా పెద్దగా విన్పించింది.

ఎగిరి గంతేశాను.

"ప్రొఫెసర్ సాబ్" గట్టిగా అరిచాను. రెండు నిము షాల తర్వాత ప్రొఫెసర్ గారి గొంతు అత్రంగా విన్పిం చింది.

"విజయ్...నువ్వేనా?"

"ఆ! నేనే సార్ విజయ్‌ని!"

"విజయ్...నువ్వు...నువ్వు...ఎక్కడున్నావ్?"

"ఇక్కడే ఉన్నాను సార్."

"ఆ! అక్కడేవుండు మళ్ళీ పిలుస్తాను."

"అలాగే సర్! అలాగే" అరిచాను. నా చేతిలోని టార్చ్ ప్రకాశిస్తోంది. ముందుకు నడిచాను. కొంచెం దూరం నడిచేప్పటికి ఎడమచేతివైపు దారి కన్పించింది. ముందంతా చీకటిగా అగమ్యగోచరంగా ఉంది.

"విజయ్ ఏంచేస్తున్నావ్?" ఈసారి మరింత స్పష్టంగా విన్పించింది ప్రొఫెసర్ గారి గొంతుక ఎదురుగావున్న చీకటి లోంచి.

"ఏం చెయ్యటంలేదు! మీరేం చెయ్యమంటారు?" అంటూ అరిచాను.

"విజయ్ ముందు మనిద్దరి మధ్య దూరమెంతో తెల్సుకోవాలి. అందుకే ఓ పని చేద్దాం. ఓ నిముషం తర్వాత నిన్ను పిలుస్తాను. నా పిలుపు వినగానే వెంటనే సమాధానం పలుకు. మాటలబట్టి శబ్దగ్రహణ యంత్రంద్వారా మనమధ్య దూరాన్ని లెక్కకడతాను."

"ఓ. కె. సార్" అరిచాను.

చకచకా పది నిముషాలు గడిచాయి.

మా ప్రయత్నం ఫలించిందని తెల్పుతూ ప్రొఫెసర్ గారి గొంతు చీకటిలో ప్రతిధ్వనించింది.

"వెల్ విజయ్, మన మధ్యదూరం తెల్సుకొన్నాను. ఎంతో తెల్సా, నువ్వూహించలేవు. ఇరవైమైళ్ళు..."

నివ్వెరబోయాను.

"ఇంపాజిబుల్. నేనమ్మలేను. లేకపోతే 20 మైళ్ళ దూరంలోని మన మాటలు ఎలా విన్పిస్తున్నాయ్?"

"విజయ్ నమ్మకేం చేస్తావోయ్! తప్పదు. ఇకపోతే మాటల విషయమా? ఇరవై మైళ్ళేమిటి ఖర్మ నలభైమైళ్లైనా

స్పష్టంగా విన్పిస్తాయి. ఎలాగో తెల్సా, మనచుట్టూ వున్న గ్రాఫైట్ రాతిపొరలద్వారా మన మాటలనుంచి వెలువడిన ధ్వనితరంగాలు గాలికంటే వేగంగా ప్రయాణించి ఇంకొకరిని చేరుకొంటాయి."

ప్రొఫెసర్ గారి గొంతు చీకటిలో గంభీరంగా ప్రతిధ్వనించింది.

రాతిగోడవైపు కృతజ్ఞతగా చూశాను.

"ఇంతకూ మిమ్మల్ని చేరుకోవడమెలా?"

"అదే ఆలోచించాలి... ఆ... అన్నట్లు నీదగ్గర ఎలక్ట్రిక్ టార్చ్ ఉందిగా."

"ఉన్నది."

"ఎలా వర్క్ చేస్తోంది?"

"ఫైన్."

"అయితే ఓ పనిచెయ్యి. నీ ఎదురుగా ఏదారివుంటే ఆ దారిన బయలుదేరు. మధ్యలో పావుగంటకోసారి ఆగి నన్ను పిలువ్. దూరం లెక్కచూసి నీ రూట్ కరక్టో కాదో తెల్పుతుంటాను. వెంటనే బయలుదేరితే ఐదారు గంటలలో మమ్మల్ని చేరుకోగలవు" అన్నారు ప్రొఫెసర్ గారు.

"ఓ. కె. సార్. నేను బయలుదేరుతున్నాను" అంటూ గట్టిగా ఒకసారి అరిచి చీకటిగావున్నా ముందుకు నడిచాను.

నా చేతిలోని టార్చి పరిసరాలను ప్రకాశవంతం చేస్తోంది. బాగా పల్లంగా ఉండటం వలన జారడం కష్టంగావున్నా గమ్యం తొందరగా చేరుకోవాలనే ఉత్సాహం ముందుకు నడిపిస్తోంది. అలా ఎంతసేపు నడిచానో, కాళ్ళు లాగుతున్నాయి. తల తిరుగుతోంది. మొత్తానికి ప్రొఫెసర్ గారి

సమయస్ఫూర్తివల్ల వారిని కలుసుకోగలిగాను. కాని ఒంట్లో శక్తిలేకపోవటంవల్ల మగతగా కళ్ళు మూతబడ్డాయి.

8

భారంగా కళ్ళు తెరిచాను. ఎదురుగా ప్రొఫెసర్ గారి ముఖం అస్పష్టంగా కన్పించింది. మరి కాస్సేపట్లో ఆదరంగా నవ్వుతున్న ఆయనను సంతోషంగా స్పష్టంగా చూడగలిగాను.

"ప్రొఫెసర్ సాబ్."

"యస్ మై బాయ్ యు ఆర్ సేఫ్" అన్నారు.

"థాంక్యూ సర్."

దగ్గరలోనే సముద్రపు హోరులా పెద్ద శబ్దం విన్పిస్తోంది.

"ఏమిటి సార్ ఆ హోరు?"

"సీ."

"సీ? అంటే మనం భూగర్భం నుంచి పైకొచ్చేశామా?"

"ఊహూ! లోనే ఉన్నాము."

"భూగర్భంలోనా! అంటే భూగర్భంలో సముద్రమా?" నమ్మలేకపోతూ అడిగాను.

"అవునోయ్ విజయ్ భూగర్భంలోనే! ఈ సముద్రం పేరేమిటో తెల్సా 'అంగోనీ మహాసముద్రం.' దీనిని కనిపెట్టిన మొదటి వ్యక్తిని నేనే కాబట్టి నా పేరే పెట్టుకొన్నాను. ఆ...అన్నట్లు మరో విచిత్రం. మనమిప్పుడెక్కడున్నామో తెల్సా? ఆఫ్రికాలోని సహారా ఎడారికి క్రింద 230 మైళ్ళ లోతులో ఉన్నాము!" అన్నారు ప్రొఫెసర్ గారు.

ఆయన మాటలు వింటూ ఆశ్చర్యంతో 'ఫెంటాస్టిక్' అంటూ గొణుక్కున్నాను. లేకపోతే పైన ఎడారి క్రింద మహాసముద్రమా?

"కావా ఎక్కడ?"

ఇంజక్షన్ నీడిల్ని డిస్టిల్ వాటర్‌తో కడుగుతున్న ప్రొఫెసర్ గారు తలెత్తి చూశారు.

"బయట పడవ తయారుచేస్తున్నాడు."

"అయితే బయట కెళ్ళి ఓసారి చూసొద్దాం" అన్నాను కొంచెం దూరంలో ఉన్న గుహ ద్వారంగుండా లోపలి కొస్తున్న మసక వెలుతురును చూస్తూ.

"నో...ఇప్పుడొద్దు. నీ ఆరోగ్యం అంత బాగోలేదు. ప్రస్తుతానికి విశ్రాంతి తీసుకో! సాయంత్రం వెళదాం" అంటూ ఇంజక్షన్ చేసి గుహ బయటకు వెళ్ళిపోయారు ప్రొఫెసర్ గారు. నెమ్మదిగా కళ్ళు మూసుకొని నిద్రలోకి జారాను.

ఆ సాయంత్రమే ప్రొఫెసర్ గారి సాయంతో బయటకు కదిలాను. ఒక్కసారి కళ్ళు జిగేలు మన్నాయి. మూడు నెలలుగా చీకటిలో చూడటానికి అలవాటుపడిన నాకళ్ళు ఆ మసక వెలుతురును తట్టుకొనేప్పటికి అరగంట పట్టింది.

అప్పుడు చూసాను ఆంధ్రోనీ మహాసముద్రాన్ని. కను చూపు మేరా నిశ్చలంగా ఉంది. తీరాన్ని మాత్రం కెర టాలు హోరుపెడుతూ బలంగా ఒడ్డును తాకుతున్నాయి. ఐదు నిముషాలు పరీక్షగా చూసాను. అంతా తెల్లగా మసక కాంతిలో ఉంది.

సూర్యుడు, సూర్యకాంతి లేకపోయినా ఏదో కాంతి ఫ్లోరోసెంట్ దీపం వెలుగులాగ తెల్లగా ప్రకాశిస్తూ ఆకాశ మంతా ప్రకాశిస్తోంది. బహుశా ఐదారు మైళ్ళ ఎత్తుంటుంది ఆకాశం. అక్కడక్కడా చిన్నచిన్న మబ్బులు పరిగెడు తున్నాయి.

చిన్నగా నిట్టూర్చి ప్రొఫెసర్ గారితో కల్సి దూరంగా

కన్పిస్తున్న చెట్లవైపు నడిచాను. బహుశా వాటి కొమ్మలే కాబోలు విరిచి తీసుకొచ్చి పడవ తయారుచేస్తున్నాడు కావా.

ఒక్కొక్క చెట్టూ నలభై, ఏభై అడుగుల ఎత్తుంది. ఒక చెట్టును పరీక్షగా చూసి ఉలిక్కిపడ్డాను. నలభై అడుగుల ఎత్తున్న ఆ చెట్టు భూమిమీద సాధారణంగా ఎక్కడబడితే అక్కడ పెరిగే అత్యల్పమైన ఫెర్న్ మొక్క అని గ్రహించటానికి ఎక్కువసేపు పట్టలేదు నాకు. అంటే ఆ చెట్లన్నీ ఫెర్న్ చెట్లన్నమాట. ఆలోచిస్తూ వెనుతిరిగి పది నిముషాలలో ప్రొఫెసర్ గారితో కల్సి గుహను చేరుకొన్నాను.

9

"వారంరోజులైంది మనం సముద్రం మీద బయలుదేరి" అంటూ జేబులోంచి డైరీ తీసాను.

టైమ్ అయిదయింది. పైన ఆకాశంలో రాత్రి పగలు లేకపోవటంతో అది ఉదయమో సాయంత్రమో తెలీలేదు. పడవ 'అంథోనీ మహాసముద్రం'లో ఉయ్యాలలా ఊగుతూ వేగంగా పోతోంది.

చల్లగా వీస్తున్న గాలికి పడవ తెరచాప రెపరెపలాడుతోంటే డైరీ రాయటం మొదలెట్టాను. కాని రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తుకు రాగానే నా గుండెలు జలదరించాయి.

ఆరోజు ఉదయమే (వాచీలో డేట్ మారటం చూసి ఉదయమని గ్రహించాను) బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేసుకొని బైనాక్యులర్స్‌తో చుట్టూ సముద్రాన్ని పరీక్షగా చూస్తున్నాను. ప్రొఫెసర్ గారు తీరిగ్గా కూర్చొని అప్పటివరకూ జరిగిన సంఘటనలూ, ఎదురైన ప్రమాణాలూ నెమరు వేసు

కొంటూంటే కావా గాలం వేసి సముద్రంలోని చిన్న చిన్న చేపలను పడుతున్నాడు.

మా దగ్గరున్న ఆహారం ఇంకా రెండు నెలల కొస్తుంది. నీటి సంగతి ఇంకో పదిహేను రోజులుదాకా చూసుకో నక్కరలేదు. కాని దారి తెన్నూ లేకుండా పడి ఈ సముద్రంలో ఎన్నాళ్ళకు ఇంకో తీరం చేరుకొంటామో? అసలు భూగర్భ కేంద్రం చేరుకోగలమో లేదో? అనే అనుమానాలు నా మనసుని ఇంకా పీకుతున్నాయి.

ఆలోచిస్తూ బైనాక్యులర్స్ లోంచి చూస్తున్నాను. ఉన్నట్లుండి నా కళ్ళు మెరిశాయి బాగా దూరంగా చిన్న చిన్న దీవులు కొన్ని అస్పష్టంగా కన్పించగానే- ప్రొఫెసర్ గారికి చెప్పగానే ఆత్రంగా నా చేతిలోని బైనాక్యులర్స్ లాక్కుని చూశారాయన.

చూస్తూండగానే మా పడవ మరి కాస్సేపట్లో ఒక దీవిని చేరుకొంది. పడవను లంగరేసి, దీవి మీదకు నడిచాము ముగ్గురమూ. మా చేతిలోని రివాల్వర్సు ఏక్షణంలోనైనా నిప్పులు క్రక్కడానికి సిద్ధంగా ఉన్నాయి.

దీవిమీద మనోహరంగా ఉంది. గలగల పారుతున్న సెలయేళ్ళు, రకరకాల చెట్లూ వాటి నిండా విరగ కాచి ఉన్న పళ్ళూ చూస్తూంటే హృదయం పరవళ్ళు త్రొక్కుతోంది. హుషారుగా ముందుకు అడుగు వేయబోతూ ఏదో శబ్దం విని ఆగిపోయి చుట్టూ పరిశీలించి చూసాను. ఓ మైలు దూరంనుంచి పెద్ద పెద్ద అంగలు వేస్తూ మా వైపు దూసుకు వస్తోంది ఏదో జంతువు. సుమారు నలభై అడుగులు ఎత్తుండి చాలా భయంకరంగా డైనోసారస్‌లా ఉంది. కంగారుగా వెనక్కి తిరిగి తీరం వైపు పరిగెత్తాము. క్షణాలలో పడవను చేరుకొని లంగరెత్తి, సముద్రంలోకి పోనిచ్చాము.

అదేసమయంలో, తీరానికి చేరుకొన్న డైనోసారస్ వంటి జంతువు పారిపోతున్న మమ్మల్ని చూసి భీకరంగా అరిచింది. నా చేతిలోని రివాల్వర్ 'ఢన్' మంది. బులెట్ దూసుకెళ్ళి దాని శరీరాన్ని తాకి క్రింద పడిపోయింది. మరోసారి భీకరంగా అరిచిందా జంతువు.

మరి కాస్సేపట్లో ఆ దీవి కనుచూపు మేర దాటిపోయింది మా పడవ.

10

జరిగిన సంఘటన నా కళ్ళకు కట్టినట్లు కన్పించగానే చిన్నగా నిట్టూర్చాను. కావా పడుతున్న చేపలను పరిశీలించి ఖాళీ సీసాలలో వేస్తున్నారు ప్రొఫెసర్ గారు. వాటిని పరిశీలించిన ప్రొఫెసర్ గారు మాకో అద్భుతమైన విషయాన్ని తెల్పారు.

ఈ అంధోని మహాసముద్రంలోని చేపలకు భూమిమీద రెండు లక్షల సంవత్సరాల క్రితం జీవించిన చేపల లక్షణాలు చాలా ఉన్నాయట. వాటిని పరిశీలించి చూడగా ప్రొఫెసర్ గారు చెప్పింది కరక్టే నన్పించింది.

పడవలో ఒక మూలగా పడేసి ఉన్న త్రాడును తీసి చుట్ట విప్పాను. సుమారు వెయ్యి అడుగుల పొడుగు త్రాడు అది. ఒక కొస బరువైన ఇనప ఊచకు కట్టి నెమ్మదిగా త్రాడును సముద్రంలోకి దించాను.

“ఏం చేస్తున్నావ్?” అంటూ రాస్తున్న బుక్ మూసారు ప్రొఫెసర్ గారు.

“లోతు చూస్తున్నాను” అన్నాను. అప్పటికే సగం త్రాడు సముద్రంలోకి వదిలాను. ఎక్కడా అడుగుభాగం తగల్లేదు సరికదా మొత్తం త్రాడు పూర్తిగా సముద్ర గర్భంలోకి వదిలినా లోతెంతో తెలీలేదు.

ప్రొఫెసర్ గారు నవ్వారు.

"మైడియర్ విజయ్. నువ్వనుకొన్నంత తక్కువ లోతు లేదీ అంధోనీ మహాసముద్రం. నా ఉద్దేశ్యంలో ఏ నాలుగైదు వేల అడుగులో ఉంటుంది" అన్నారు.

నేను మాట్లాడకుండా త్రాడు పైకి లాగాను. పావు గంటలో ఇనప ఊచ సముద్ర ఉపరితలానికి వచ్చింది. దానిని చేతిలోకి తీసుకొంటూ దానిపై ఉన్న పళ్ళ గుర్తులను చూసి ఉలిక్కిపడి కళ్ళు పెద్దవి చేశాను.

ప్రొఫెసర్ గారు కళ్ళజోడు తడుముకొంటూ దానికేసే పరీక్షగా చూస్తూ,

"విజయ్, మనమో పెద్ద ప్రమాదంలో చిక్కుకొన్నామోయ్!" అన్నారు.

"ప్రమాదమా?"

"అవునోయ్... నా ఉద్దేశ్యంలో ప్రమాదమే. ఈ ఇనప ఊచపై పళ్ళ గుర్తులను పరీక్షగా చూశావుగా. ఏదో సముద్ర జంతువు ఇనుప ఊచను చూసి ఏమిటో అనుకొని కరిచి ఉంటుంది. అవునా?...అయితే అది ఎలాంటి జంతువు అంటావ్?"

"బహుశా ఏ రాక్షసి మొసలో అయి ఉండొచ్చు" అన్నాను.

"కరెక్ట్. అంతటి పెద్ద జంతువు అయితే తప్ప ఇలాంటి ఇనప ఊచను అవలీలగా కరవలేవు. అంటే ఇందులో చిన్న జీవులే కాకుండా పెద్ద పెద్ద సముద్ర జంతువులు కూడా ఉన్నాయన్నమాట" ప్రొఫెసర్ గారి మాట పూర్తి కాకుండానే కావా పెద్దగా అరిచాడు. అతను చూస్తున్న వైపు చూడగానే ప్రొఫెసర్ గారి ఊహ నిజమనిపించింది.

దూరంగా సముద్ర గర్భంలోంచి చాలా భయంకరమైన

జంతువొకటి సుమారు ఎనభై అడుగుల ఎత్తున్నది పైకి లేస్తోంది. దాని మెడనుంచి పైభాగమంతా సర్పం ఆకారం పోలిఉంటే క్రింది భాగమంతా పదీ, పదిహేను ఏనుగుల ప్రమాణంలో ఉంది.

కొండ చిలువలా తల త్రిప్పుతూ భయంకరంగా అరిచింది ఆ జంతువు. అరుస్తున్నప్పుడు నోటి వెంట పొగలు బయటకు చిమ్మాయి. ఆ అరుపుకు సముద్ర కెరటాలు ఉవ్వెత్తున లేచి మా పడవను దూరంగా నెట్టుకుపోయాయి.

అదే సమయంలో మరో విచిత్రం జరిగింది. ఆ రాక్షసి జంతువు రెండోసారి అరుస్తుండగా మరో రకమైన గర్జన విన్పించింది. మేము ఆశ్చర్యపోతూ నోరెళ్ళబెట్టి చూస్తుండగానే మరో వైపునుంచి నీటిలో ఈదుకొచ్చిన మరో జంతువు మొదటిదానితో కలబడింది.

దీని ఆకారం ముళ్ళపందిని పోలి వుందిగాని సైజు మాత్రం మొదటిదానికి ఏమాత్రం తీసిపోకుండా వుంది. మొదటి జంతువు మరోసారి అరిచి రెండోదానితో కలబడింది.

ప్రొఫెసర్ గారు తేరుకొని బాగ్ లోంచి కెమెరా తీసి చకచక ఫొటోలు తీయసాగారు.

సముద్రంలో భయంకరంగా రెండూ కొట్టుకొంటుంటే విసురుగా లేస్తున్న కెరటాలకు చిన్న చెక్కముక్కలా మా పడవ దూరంగా దూసుకుపోతూంది.

బద్ధశత్రువుల్లా కొట్టుకొంటున్నాయి రెండూ. మొదటిది విషం క్రక్కుతూ బుసలుకొడుతూంటే, రెండో జంతువు మొదటిదాని మెడకొరికి వేయడానికి ప్రయత్నిస్తోంది. ఒకదాని నొకటి కరుచుకొంటూ కాళ్ళతో తన్నుకొంటూ, నీళ్ళను అల్లకల్లోలం చేస్తున్నాయి.

చూస్తూండగానే రెండో జంతువు గాయపడి సముద్రంలో మునిగిపోయింది. మొదటి జంతువు మోర పైకెత్తి విజయ సూచనగా భయంకరంగా ఓ అరుపు అరిచి వెనుతిరిగి నీటిలో ఈదుకొంటూ దూరంగా కన్పించకుండా పోయింది.

మరి కాస్సేపట్లో గాయపడి సముద్రంలో మునిగి పోయిన రెండో జంతువు కళేబరం నీటిపైకి నిర్జీవంగా తేలిపోయింది.

11

సుమారు రెండు మైళ్ళ చుట్టుకొలత కలిగి ఉందా దీవి. మధ్యలో చిన్న సెలయేరు, అక్కడక్కడా కొన్ని చెట్లతో నిర్జనంగా వుంది.

బైనాక్యులర్స్‌లో దీవంతా మరోసారి స్పష్టంగా పరిశీలించి పడవను ఆపి దీవిమీదకు దూకాను. ఓ గంటసేపు దీవంతా ముగ్గురం కలియ తిరిగాము. చెట్లనున్న పళ్ళు కోసుకొని తిన్నాము. తియ్యగా వున్నాయి. సెలయేరులో నీరు త్రాగాము. రుచిగా తాగేకొద్దీ తాగాలన్పిస్తోన్నాయి.

“వళ్ళంతా చిరాగ్గా వుంది” అన్నాడు కావా బట్టలిప్పుకొంటూ. స్నానంచేసి ఎన్నాళ్ళయిందోకాని గనుల్లో పనిచేసే కార్మికుల్లా వున్నాము.

ఎగిరి నీటిలోకి దూకాడు కావా. చుట్టూ పరిశీలించి చూడసాగాను.

“విజయ్” పిల్చారు ప్రొఫెసర్ గారు.

ఆయనవైపు తిరిగాను.

క్రింద ఇసుకను పరిశీలిస్తున్నారు ఆయన. తళతళ మెరుస్తోంది ఇసుక.

"విజయ్..." ఏదో అనబోతుండగా కావా అరుపు విన్పించింది. కంగారుగా పరిగెత్తాము ఇద్దరం. నీటిలో మునిగిపోయి గింజుకొంటున్నాడతను. నోటమ్మట వెలువడు తున్న గాలి, బుడగల రూపంలో పైకొస్తూంది.

ప్రొఫెసర్ గారి దృష్టి అతని కాలిపై పడింది. అతని కాలిని నల్లటి పొడవాంటి జంతువేదో చుట్టుకొని క్రిందకు లాగుతోంది. దానినుంచి తప్పించుకో దానికి గింజుకొంటు న్నాడతను.

"ముర్రే ఈల్" అన్నారు ప్రొఫెసర్ గారు అస్పష్టంగా. ఆయన ముఖం పాలిపోయింది. ఎప్పుడో నేవీ క్లాసులో సముద్ర జంతువులపై చెప్పిన పాఠం గుర్తొచ్చింది నాకు.

'ఈ ముర్రే ఈల్స్ చాలా భయంకరమైన సముద్ర జంతువులు. సన్నగా పొడుగ్గా పాములా వున్నా నీటిలో దీని బలంముందు ఎంత పెద్ద జంతువైనా ఆగలేదు. సాధా రణంగా ఈ ముర్రే ఈల్స్ బంగాళాఖాతంలో అండ మాన్స్ దగ్గరగా వున్న పగడపు కొండలలో ఎక్కువగా వుంటాయి. రాతిలో బిలాలు ఏర్పాటు చేసుకొని అందులో పొంచి వుండి ఏ జంతువన్నా సమీపంలోకి రాగానే దాన్ని పట్టుకొని రక్తం పీల్చేస్తాయి.'

జేబులోంచి బటన్ నైఫ్ లాగాను. బటన్ నొక్క గానే 'నక్' మంటూ బ్లేడ్ పైకి వచ్చింది. ఎగిరి నీటిలోకి దూకాను. మసక కాంతి వెన్నెలలా నీటిలో ప్రతిఫలి స్తోంది. కావాలో ప్రతి ఘటన తగ్గిపోతోంది. ఏ క్షణా న్నైనా ప్రాణం పోయేటట్లున్నది. దగ్గరగా వెళ్ళి ముర్రే ఈల్ ను నైఫ్ తో బలంగా పొడిచాను. బ్లేడ్ 'ఈల్' శరీ రంలో దిగబడింది. పచ్చటి ద్రవం బయటకు చిమ్మింది. నైఫ్

వెనక్కి లాగి మరోసారి పొడవబోయాను.

ఈలోగా కావాకాలుని వదిలి నాపైకి విజృంభించింది 'ఈల్'. జాగ్రత్తగా కాచుకొంటూ మరో రెండు పోట్లు పొడిచాను. 'ఈల్' గిలగిలలాడుతూ వెనక్కి తిరిగి బిలం లోకి పారిపోయింది. ఈదుకొంటూ పైకొచ్చాను.

అప్పటికే కావా కాలు కట్టుకట్టిన ప్రొఫెసర్ గారు ఇసకలో అలసటగా కూలబడ్డ నన్ను మెచ్చుకోలుగా చూశారు. కావా నా వైపు కృతజ్ఞతగా చూస్తున్నాడు.

అదే సమయంలో ఆ దీవంతా ఒక్కసారి కంపించింది. అదిరిపడి లేచి నిలబడ్డాను. ప్రొఫెసర్ గారి కళ్ళు అను మానంతో చిన్నవైనాయ్! ఆయన చేతిలోంచి బైనాక్యు లర్స్ లాక్కొని చుట్టూ చూశాను. ఏమీ కన్పించలేదు.

అంతలో దీవి మళ్ళీ కంపించింది. ఈసారి మరింత తీవ్రంగా కంపించింది.

ప్రొఫెసర్ గారు కంగారుగా అరిచారు. "విజయ్! తొందరగా మనం పడవను చేరుకోవాలి. మరి కాస్సేపట్లో దీవి సముద్రంలో మునిగిపోబోతుంది."

కావాను భుజంపై వేసుకొని పరిగెత్తాను. నన్ననుసరిం చారు ప్రొఫెసర్ గారు. బరువైన కావాను మోయడం కష్టంగా వుంది. భారంగా పడుతున్నాయి నా అడుగులు.

"దీవి మునిగిపోతుందని ఎలా చెప్పగలరు" పరిగెడుతూ అడిగాను.

"సింపిల్. సాధారణంగా సముద్రంలోని ఇలాంటి చిన్న దీవులు ఒకచోట స్థిరంగా వుండవు. ఒకచోట మునిగి సముద్రగర్భంలో ప్రయాణించి ఇంకోచోట తేలు తుంటాయ్. అంతేకాదు సముద్రంలో దీవులు తగిన కారణం లేనిదే ఎప్పుడూ కంపించవు. ఇలా రెండు మూడుసార్లు

కంపించిందంటే, అది త్వరలో మునిగిపోతుంది" అన్నారు ప్రొఫెసర్ గారు.

రెండు నిముషాలలో పడవను చేరుకొన్నాము. మరు క్షణంలో దీవి మరోసారి తీవ్రంగా కంపించి నీటిలో మునిగిపోయింది. పడవను ముందుకు పోనిచ్చాను.

12

ఎవరో బలంగా కుదుపుతోంటే బద్ధకంగా కళ్ళు తెరిచాను. చుట్టూ వున్న వాతావరణం చూసేప్పటికి బద్ధకం ఎగిరిపోయింది. కంగారుగా లేచి కూర్చొన్నాను.

ఎప్పుడూ తెల్లకాంతితో పాలిపోయినట్లుండే ఆకాశం నిండా నల్లటి మబ్బులు ముసురుకొన్నాయి. ఏ క్షణంలో నన్నా కుంభవృష్టి కురవ్వచ్చన్పిస్తోంది. చల్లగా గాలి వీస్తూంటే సముద్ర తరంగాలు ఎగిరెగిరి పడుతున్నాయి. పడవ కెరటాల వరవడికి తట్టుకోలేక ఊగిసలాడుతోంది.

చూస్తూండగానే ఉరుములూ, మెరుపులతో తుఫాన్ మొదలైంది. ఒక్కసారిగా మెరసిన మెరుపుతో మా కళ్ళు బైర్లుకమ్మాయి. చకచకా సామానులు సర్దుకొని వీపులకు కట్టుకొన్నాము. రావా చుక్కాని వద్ద కూర్చొని వరిగిపోతున్న పడవను అదుపులో పెట్టటానికి ప్రయత్ని స్తున్నాడు.

అప్పుడప్పుడూ మెరుస్తోన్న మెరుపులు తప్ప కన్ను పొడుచుకున్నా కన్పించని కారు చీకటిలో సముద్రం విలయతాండవ మాడుతోంది. ఉరుము శబ్దానికి చెవులు గళ్లెక్కిపోతోంటే, హోరుమంటూ వీస్తున్న చలిగాలి మా శరీరాన్ని కొరికేస్తోంది.

గాలికి తట్టుకోలేక తెరచాప రెపరెపలాడుతూ ఏ క్షణాన్నైనా చిరిగిపోయేట్లుండటం చూసిన ప్రొఫెసర్

గారు దాన్ని క్రిందకు దింపేయటానికి పరిగెత్తారు.

కొయ్యరాట పట్టుకుని తాడు ముడి విప్పబోతున్న ప్రొఫెసర్ గారి దృష్టి అప్పుడే బయలుదేరిన 'విద్యుత్ కాంతి పుంజం'పై నిలిచింది.

విష్ణుచక్రంలా గిరగిరా తిరుగుతూ విద్యుచ్ఛక్తితో తెల్లగా మెరిసిపోతూన్న ఆ 'కాంతి పుంజం' ప్రొఫెసర్ గారి వైపు దూసుకొచ్చింది. చటుక్కున క్రిందకు వంగారు ప్రొఫెసర్ గారు.

మరుక్షణంలో కొయ్యరాటను అడ్డంగా చీల్చివేస్తూ నా తలపైనుంచి దూసుకుపోయిందా 'కాంతి పుంజం.' రెండడుగులు పైకిలేచిన తెరచాప గాల్లో కెగిరిపోయింది.

దూరంగా వెళ్ళిపోయిన 'విద్యుత్ కాంతి పుంజం' గిర గిరా తిరుగుతూ వెనక్కి తిరిగి పడవవైపు తిరిగి రాసాగింది. చుక్కాని వదిలేసి కావా మా దగ్గరకు పరిగెత్తుకొని వచ్చాడు.

'ఇనపసామానులు సముద్రంలో పడేసి బోర్లా పడుకోండి' అరిచారు ప్రొఫెసర్ గారు.

పడవలో వున్న నాలుగైదు ఇనప ఊచలను, కొద్ది ఇనప సామానులను సముద్రంలోకి విసిరేసాము. అయస్కాంత శక్తి కలిగిన ఆ 'విద్యుత్ కాంతి పుంజం' ఇనప సామానులు సముద్రంలోకి మేము విసిరేయగానే గమ్యం మారి మరో వైపు దూసుకుపోయింది.

ప్రొఫెసర్ గారి దగ్గరున్న దిక్సూచి మా చేతినున్న వాచీలు అయస్కాంత శక్తికి ఆకర్షించబడి పాడయ్యాయి. చుక్కానిలేని పడవ సముద్రంలో దిక్కు తెలీకుండా కొట్టుకుపోతూంది.

సముద్ర కెరటాల తాకిడికి పడవ సగభాగం విరిగి

పోయింది. మేమున్న చెక్క దూరంగా కన్పిస్తున్న కొండరాళ్ళవైపు దూసుకు వెళ్తోంది.

అప్పుడు చూసాను దూరంగా నిలువెత్తు లేస్తోన్న కెర టాన్ని. చివరిసారిగా భగవంతుని తల్చుకుంటూ కళ్ళు మూసుకున్నాను.

13

ఎవరో పిలుస్తోంటే లేచాను. ఎదురుగా ప్రొఫెసర్ గారూ కావా ఆత్రంగా చూస్తున్నారు. నేను కళ్ళు తెరవ గానే వారికళ్ళు మెరిశాయి. నెమ్మదిగా లేచి కూర్చున్నాను.

పైన ఆకాశం యథాస్థితిలోనే వుంది. ఫ్లోరోసెంట్ లాంప్ లా తెల్లగా వెలుగునిస్తోంది. అక్కడక్కడ చిన్న చిన్న మేఘాలు కంగారుగా పరిగెడుతున్నాయి.

సముద్రపు అలలు వేగంగావచ్చి మేం పడివున్న బండ రాళ్ళను తాకుతున్నాయి బలంగా. తల త్రిప్పి చుట్టూ చూశాను. కొంచెందూరంలో ఇసకా, మరికొంచెందూరంలో తీరంపొడుగునా కనుచూపుమేరా రాతిగోడా వుంది.

నా శరీరాన్ని అదుపులోకి తెచ్చుకొనేసరికి అరగంట పట్టింది. మరికాస్సేపట్లో కాలకృత్యాలు తీర్చుకొని బ్రేక్ ఫాస్ట్ కావించాము. కావా తిరిగి చెక్కను రిపేర్ చేయ టంలో పడగానే, నేనూ ప్రొఫెసర్ గారూ తీరంవెంబడి బయలుదేరాము.

కొంచెముందు నడుస్తున్న ప్రొఫెసర్ గారు ఒకచోట ఆగిపోయారు. వారివైపు ప్రశ్నార్థకంగా చూశాను.

"ఫాసిల్స్" (అవశేషాలు) అన్నారు ఒకవైపు చూపిస్తూ. వెంటనే అక్కడకు నడిచాము. రకరకాల జంతువుల ఫాసిల్స్ చెల్లాచెదురుగా పడివున్నాయి. వాటి రూపురేఖలు చూస్తూంటే ఒకొక్కజంతువూ కొన్ని లక్షల

సంవత్సరాల క్రితందని తెలుస్తూంది. వాటిలో కొన్నింటిని వివరించారు ప్రొఫెసర్ గారు.

"స్కాల్లోపోసు చస్, పైటో సార్స్, థెరోపోడ్స్, అల్లోసార్స్, గేంగిస్, డైనోసార్స్, డిప్లోకోడస్, బ్రోంటో సార్స్, యిగ్వానోడన్, సెరాటోప్సియన్స్, ప్రోట్రోసెరా ట్రోప్స్" అంటూ చెప్తూంటే చాలా ఆశ్చర్యంగా చూశాను. కెమెరా పైకితీసి చకచకా ఫోటోలు తీసారు ప్రొఫెసర్ గారు. తిరిగి బయలుదేరాము. ముందుకు నడుస్తూ అన్నాడు ప్రొఫెసర్ గారు.

"ఒకవిధంగా చెప్పాలంటే ఇవన్నీ డైనోసార్స్ జాతికి సంబంధించినవే! ఇవికూడా కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమిమీద బ్రతికినవే! భూమిమీద నరుడు పుట్టక ముందే ఏర్పడిన జంతువుల సముదాయంలోనివి ఇవి. భూమ్మీద ప్రతీ జంతువూ దీనికి భయపడేది. అందుకే జంతువులకి రాజు కాగలిగింది ఈ డైనోసార్స్. కాని ఒక విచిత్రం. ఈ డైనో సార్స్, దాని కుటుంబానికి చెందిన ఈ జంతువులూ అన్నీ కేవలం శాఖాహారులు మాత్రమే. మాంసాహారులను చూస్తే వాటికి మంట" చెప్తున్న ప్రొఫె సర్ గారు ఆగారు.

నా కళ్ళముందు ఎనభై అడుగుల ఎత్తున్న డైనోసార్సు లీలగా కన్పిస్తోంది. కొంతదూరం పోయేప్పటికి కొండగా పల్లపుప్రాంతంలో ఉన్న చెట్లవైపు ఆశ్చర్యంగా చూస్తూ తొందరగా నడిచాము.

నడుస్తున్న ప్రొఫెసర్ గారు చటుక్కున ఆగి నా చెయ్యి పట్టుకున్నారు. వారి చెయ్యెందుకో చిన్నగా ఒణుకుతోంది. వారు చూస్తున్నవైపు చూసాను. నాగుండె ఝల్లుమంది.

అడవిలావున్న చెట్లమధ్య కొంతదూరంలో పెద్ద పెద్ద ఖడ్గమృగాలవంటి జంతువులు చెట్ల మొదళ్ళలో పొడిచి విరగగొట్టేస్తున్నాయ్! వాటికి కొంచెందూరంలో ఒక ఆజానుబాహుడు భుజంపై రాతిగదవంటిది పెట్టుకుని వాటిని అదలిస్తున్నాడు.

'ఒళ్ళంతా బొచ్చు, చిన్న తల, ముందుకు పొడుసుకు వచ్చిన నుదురు, పెద్ద దవడ ఎముకలు.' నియాండర్తల్ (అనాది) మానవుడిలా ఉన్నాడు. ప్రొఫెసర్ గారి చేతిలోని కెమెరా 'క్లిక్' మంది.

చప్పుడు కాకుండా దూరంగా వచ్చేశాక హాయిగా ఊపిరి పీల్చుకొన్నారు ప్రొఫెసర్ గారు. తిరిగి మేము సముద్రం ఒడ్డుకు చేరుకొనేసరికి 'కావా' పడవను బాగు చేశాడు.

14

సముద్రపు ఒడ్డునే దూరంగా కన్పిస్తున్న రాతిగోడ వైపు నడిచాము. తీరం పొడుగునా ఉంది రాతిగోడ. గ్రాఫైట్ రాతిని పరీక్షిస్తూ నడుస్తున్న నేను కాళ్ళకు ఏదో తగిలి బోర్లా పడబోయి నిలదొక్కుకున్నాను. క్రిందకు చూసాను. పిడి బాకు. చటుక్కున వంగి దాన్నందుకొన్నాను. బాకు కిలంతో నల్లబడిపోయినా, పిడి మాత్రం తెల్లగా మెరుస్తోంది. దానిపై 'కింగ్ అయిరన్ వర్క్స్ ఐర్లండ్' అన్న అక్షరాలు తళతళా మెరుస్తోన్నాయి.

దానిని చూడగానే ప్రొఫెసర్ గారి భృకుటి ముడి పడింది. "ఈ బాకు ఇక్కడకు వచ్చిందంటే ఇక్కడ కెవరో వచ్చి ఉండాలి. అదీ ఐర్లండు నివాసి" ఆలోచిస్తున్న ఆయన మదిలో ఫిలిప్స్ జె అడ్వర్డ్ మెదిలాడు.

'బహుశా, అదే జరిగి ఉండొచ్చు. అంటే ... ఫిలిప్స్

జె అడ్వర్డ్ ఈ ప్రాంతం వచ్చాడన్నమాట. అయితే ఇటు నుంచి ఎటువైపు వెళ్ళి ఉంటాడు' ఆలోచిస్తూ రాతి గోడను పరిశీలిస్తూ ముందుకు నడుస్తున్న ప్రొఫెసర్ గారు ఆగిపోయారు ఒకచోట.

ఆయన నిలచినచోట, లోగడ, ఒక సొరంగ మార్గం ఉండేదని స్పష్టంగా తెలుస్తోంది. కాని కాలక్రమాన ఏ భూకంపం వలన ఆ సొరంగంకు అడ్డుగా పెద్ద బండరాయి పడిఉంటుంది. అందుకే మనిషి దూరటానికి కూడా సందు లేకుండా ఆ బండరాయి అడ్డుగా ఉంది.

ఆయన నావైపు తిరగగానే ప్రశ్నార్థకంగా చూసాను నేను.

“ఈ బండను మనం శక్తితో కదిలించలేం విజయ్” అన్నారు ఆలోచిస్తూ.

నా తలలో ఒక ఆలోచన మెరిసింది.

“ఓ పని చేస్తే?” అన్నాను అకస్మాత్తుగా. ఆసక్తిగా చూసారు ప్రొఫెసర్ గారు.

“మన సంచిల్లో కొన్ని డైనమేట్ లు ఉన్నట్లు గుర్తు” అన్నాను ఆలోచిస్తూ.

“యస్...వచ్చేటప్పుడు రెండు తీసుకొచ్చాం.”

“వెల్ వాటిలో ఒకదానికి పని కల్పిద్దాం.”

రెండునిముషాలు తీవ్రంగా ఆలోచించి,‘ఓ.కె’అన్నారు.

ప్రొఫెసర్ గారి బాగ్ అడుగునున్న డైనమేట్లలో ఒకటి అందుకొన్నాను. రాతిబండ దగ్గరగా నడిచి రెండు నిముషాలు పరీక్షగా చూసాను. డైనమేట్ ను సొరంగంలో పలికి, చేయి ఇరికించి ఉంచి వత్తిని దూరంగా పరుచుకొచ్చి అంటించి సముద్రవడ్డున ఉన్న పడవ దగ్గరకు పరిగెత్తాను.

ఎగిరి పడవలోకి దూకి మిగిలిన ఇద్దరిలాగే చెవుల్లో

వ్రేళ్ళు బిగించి క్రిందకు వంగాను. 'ఢన్' మంటూ పెద్ద శబ్దంతో ప్రేలింది డైనమేట్. బండరాయి రెండుగా బ్రద్ద లయి దొర్లుకొంటూ దూరంగా పోయింది.

మరుక్షణంలోనే మేం ఊహించని ప్రమాదం ఏర్పడింది. డైనమేట్ ప్రేలుడుకు భూమి అదిరి, భూకంపంగా మారింది. భూకంప వత్తిడి సముద్రంపై చూపడంతో సముద్రం పొంగింది. మేము పడవలోంచి దిగబోయేలోపలే నీరు పడవను పైకెత్తేస్తూ క్రొత్తగా ఏర్పడిన సొరంగంలోకి ప్రచండ వేగంతో జొరబడింది.

మేం నిస్సహాయ స్థితిలోంచి తేరుకొనే టప్పటికే పడవ లోని బాగ్‌లు, అన్ని వస్తువులు చెల్లాచెదురై క్రిందకు పడి పోయాయి. పడవ నీటి వేగానికి తట్టుకోలేక గిరగిరా తిరుగుతూ ముందుకు దూసుకుపోతున్నదల్లా ఆగి వక్క సారిగా పైకి లేచింది. క్షణాలలో కొన్ని వందల అడు గుల ఎత్తుకు పోయాము.

అప్పటివరకూ క్రింద పరవళ్ళు త్రొక్కిన నీరు వేడెక్కి బురబుర లాడసాగింది. పైకి దూసుకుపోతున్న పడవ, పడవ క్రింద మరుగుతున్న నీరు. అరగంట గడిచింది. రానురానూ వేగం పెరుగుతోంది. వేగానికి తట్టుకోలేక నా కళ్ళు తిరుగుతున్నాయి.

15

"ఆహారం ఏమయినా మిగిలిందా?" నీరసంగా అడి గారు ప్రొఫెసర్ గారు.

'ఊహూ' తల అడ్డంగా ఊపాను.

"ప్రస్తుతం మీ చేతుల్లో ఉన్న కెమెరా, నా చేతుల్లో ఉన్న ఈ వాటర్ బాటిల్ తప్ప ఏదీ మిగల్లేదు" అన్నాను నిస్సహాయంగా.

ప్రొఫెసర్ కొన్ని క్షణాలు మాట్లాడలేదు.

"సుమారు నూటేభై మైళ్ళు వచ్చుంటాము" వేగాన్ని బట్టి లెక్కకడుతూ అన్నారు ప్రొఫెసర్ గారు. పోను పోనూ చుట్టూవున్న గోడలు వేడెక్కుతున్నాయి.

తళతళా మెరిసే గ్రాఫైట్ గోడలు బదులు పచ్చగా మెరుస్తున్న గంధకపు గోడలు ఏర్పడుతున్నాయి. పొగలు రగులుతోంటే ఊపిరి పీల్చటం కష్టమాతూంది.

"మైగాడ్ ...అగ్ని పర్వతం" అరిచారు ప్రొఫెసర్ గారు.

అప్పుడర్థమైంది మా పడవ క్రింద మరుగుతున్నది నీరు కాదు లావా అని. ఏ క్షణానైనా ఏ గోడనో గుద్దుకుని మా ప్రాణాలు పోవచ్చు లేకపోతే ఉన్న ఫళంగా పడవ వేడికి విడిపోయి మేం లావాలో కల్సిపోవచ్చు. మాకు ప్రాణాలపై ఆశపోయింది. రానురానూ ఆక్సిజన్ తగ్గిపోయి పొగ ఊపిరి తిత్తులలోకి ప్రవేశించడం వలన ఊపిరి తిత్తులు పగిలిపోయేలాగున్నాయ్!

ఏ క్షణంలోనైనా మా వంటిమీద వున్న దళసరికోట్లు, బట్టలు వేడికి తట్టుకోలేక అంటుకు పోవచ్చు. ఆ బట్టల వెనక దాగిన మా శరీరాలు ఉడికిపోతున్నాయ్!

కళ్ళు బయటకు వచ్చే స్థితిలో వుంటే నాలుక పిడుచ కట్టుకుపోయి పగిలిపోయేలాగ వుంది. గంధకపు వేడికి మా తలవెంట్రుకలు నిలబడి ఎవరో పీకుతున్నంత బాధగా వుంది.

ముఖమంతా నల్లగా మాడింది. కళ్ళు మండుతున్నాయ్. వళ్ళంతా చెమటలతో తడిసిపోయింది. లావా వేడికి పడవ అడుగు భాగం అంటుకుంది. శరీరం నలుపు రంగుకు తిరిగింది.

అదే సమయంలో,

చల్లగా, చిన్నగా గాలి వీచింది. వేడి కొద్దిగా తగ్గింది. ఒక్కసారిగా తలపై నక్షత్రాలు ఫక్కుమన్నాయి. మరు క్షణంలో పడవ విసురుగా పైకిలేచి ఆ అగ్ని పర్వతం బిలంనుంచి పైకి దూసుకుపోతూ మమ్మల్ని ప్రక్కకు విసిరేసింది.

పడవ వెనకే బయటకు ధారగా దూకిన లావా మరో దారమ్మట క్రిందకు ప్రవహించింది.

అగ్ని పర్వతం చిన్నగా ఉరుముతోంది. ఉన్నట్లుండి బయటకు వస్తున్నలావా ఆగిపోయింది. తాత్కాలిక ప్రశాంతత ఏర్పడింది.

* * *

లేచి నిలబడ్డాము ముగ్గురం.

చుట్టూ పరిశీలించి చూస్తూ అన్నారు ప్రొఫెసర్ గారు.

"భూగర్భ కేంద్రానికి ఐస్‌లాండ్‌లోని స్నోఫెల్ అగ్ని పర్వతంలోంచి బయలుదేరిన మనం మధ్యదారినుంచే అగ్నిపర్వతంలోంచి జపాన్ చేరుకొన్నాం."

హావా నేనూ ఆశ్చర్యపడ్డాం.

"వాట్! ఇది జపానా, ఎలా చెప్పగలరు?"

"జపాన్‌లో అగ్నిపర్వతాలెక్కువ విజయ్!"

చుట్టూ పరిశీలించాను. అగ్నిపర్వతాలు అస్పష్టంగా కన్పిస్తున్నాయి. జపానులో అగ్నిపర్వతాలెక్కువ అన్న ప్రొఫసర్ గారి మాటలు నాలో ప్రతిధ్వనించాయి.

"అయితే ఇండియాకు దగ్గరలోనే వున్నాము" అంటూ పర్వతపు అంచుకుపోయి దిగువకు చూసాను. దూరంగా ఏదో ఊరున్న సంగతి తెల్పుతూ దీపాలు మినుకు మినుకు మంటున్నాయి.

ఆనందంతో గంతులేయాలన్పించింది నాకు. ఇక చూడ నను కొన్న మనుషుల్ని తిరిగి చూడబోతున్నాను. ప్రాణా లతో నా దేశం చేరుకోలేననుకున్న నేను త్వరలోనే నా దేశం చేరుకోబోతున్నాను.

నా ఆలోచనలకూ ఆనందానికీ భంగం కలిగిస్తూ అన్నారు ప్రొఫెసర్ గారు:

"వెల్. చివరికి మన భూగర్భ సాహసయాత్ర ఇలా ముగిసిందన్న మాట. అదృష్టం బాగుండి ప్రాణాలతో బయట పడ్డాము. మన భూగర్భ సాహసయాత్రలో జరిగిన ప్రతీ సంఘటనకూ గుర్తు ఈ కెమెరా, ఈ నాలుగురీళ్ళు! ఇక కదలండి. త్వరగా మనం ఈ ప్రదేశం వదిలి వెళ్ళి పోవటం మంచిది. ఈ అగ్నిపర్వతాలు ఒక్కసారిగా ప్రేలవ్. క్రొద్ది క్రొద్దిగా ప్రేలుతుంటాయ్! మరో అర గంటలో మళ్ళీ ప్రేలొచ్చు!"

అంటూ చేతిలోని కెమెరా ఊపుకుంటూ క్రిందకు కది లారు ప్రొఫెసర్.

ఆయనను మౌనంగా అనుసరించాము కావా, నేనూ.

—: ఐపోయింది : —